

డీసీసీ పీఠం పై.. గురి

- జిల్లా పార్టీ పదవులపై దృష్టి సారించిన అధిష్ఠానం
- కాంగ్రెస్ నేతల పోటాపోటీ ప్రయత్నాలు
- రేసులో కందితో పాటు మరో ముగ్గురు నేతలు
- ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యే, సత్తుల మద్దతే కీలకం
- డీసీసీ పదవిపై అధికార పార్టీలో హాట్‌టాఫిక్

ఆదిలాబాద్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇటీవలే టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్ గౌడ్ నియామకం పూర్తికావడంతో ఇక డీసీసీ అధ్యక్ష పీఠం ఎవరన్నది జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. డీసీసీ సీటుపై గురిపెట్టిన పలువురు కాంగ్రెస్ నేతలు.. పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని విజయం సాధించిన కాంగ్రెస్.. దశాబ్ద కాలం తర్వాత అధికారం చేపట్టింది. గత యేడాది కాలంగా ఆ పార్టీకి జిల్లా రథసారథి లేకపోవడంతో కొంత ఇబ్బందికరంగా మారింది. 2018 ఎన్నికల నుంచి పూర్తిస్థాయి డీసీసీ అధ్యక్షుడు లేకుండానే పార్టీ కార్యక్రమాలను కొనసాగిస్తూ వస్తున్నారు. మాజీ డీసీసీ అధ్యక్షుడు భార్గవ్‌దేశ్ పాండే రాజీనామాతో సీనియర్ నేత సాజిద్‌ఖాన్ కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. 2023 ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పని చేశారన్న ఆరోపణలతో.. ఆయనను పార్టీ అధిష్ఠానం కొంత కాలం పాటు సస్పెండ్ చేసింది. ఆ తర్వాత డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. జిల్లా కాంగ్రెస్ పార్టీలో అనుకూలమైన పరిస్థితులు లేకపోవడంతో పార్టీ అధిష్ఠానం కూడా ఇన్నాళ్లు డీసీసీ అధ్యక్షుడి జోలికి వెళ్లలేదు. ప్రస్తుతం పరిస్థితులు చక్కబడడంతో మళ్లీ డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక తెరపైకి వస్తోంది. దీంతో జిల్లాకు చెందిన కంది శ్రీనివాస్‌రెడ్డి, గోక గణేష్‌రెడ్డి, బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, సురుకుంటి శ్రీధర్‌రెడ్డిల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో కొత్తగా పార్టీ పగ్గాలు చేపట్టిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ జిల్లా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా దృష్టి సారించినట్లు తెలుస్తుంది. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన ఉంటుందని సమాచారం. జిల్లా పార్టీ అధ్యక్షుడి ఎన్నిక.. ఆలోపే కొత్త డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక పూర్తయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తుంది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికలు కూడా దగ్గర పడడంతో డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక తప్పనిసరిగా మారిందంటున్నారు.

అధిష్ఠానం చుట్టూ చక్కర్లు

డీసీసీ పీఠంపై గురిపెట్టిన నేతలంతా అధిష్ఠానం పెద్దల చుట్టు చక్కర్లు కొడుతున్నారు. పార్టీలో తమకున్న పరిచయాలు, సంబంధాలతో ఎలాగైనా డీసీసీ అధ్యక్ష పీఠాన్ని దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కనిపించిన నేతనల్లా కలుస్తూ తమకే డీసీసీ పదవిని ఇప్పించాలంటూ మొరపెట్టుకుంటున్నారు. పార్టీ కష్టకాలంలో ఉండగా.. పార్టీనే నమ్ముకుని ఉన్నామని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. పనిలో పనిగా ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటూ తమ ఈమేజ్‌ను పెంచుకునే ప్రయత్నాలు సాగిస్తున్నారు. డీసీసీ పీఠం కోసం పోటీపడుతున్న నేతలంతా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలే కావడం పార్టీలో ఆసక్తికరంగా మారింది. అయితే పార్టీని ముందుకు నడిపించే బలమైన నేతకే డీసీసీ పదవిని ఇచ్చేందుకు పార్టీ అధిష్ఠానం ఆసక్తి చూపిస్తున్నట్లు తెలిసింది. జిల్లాలో బలంగా కనిపిస్తున్న బీఆర్ఎస్, బీజేపీ పార్టీల దూకుడుకు చెక్ పెట్టే విధంగా డీసీసీ అధ్యక్షుడి నియామకం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే రోజుకో రకమైన ప్రచారం జరుగడంతో పార్టీ శ్రేణుల్లో అయోమయం కనిపిస్తోంది.



కంది వైపే మొగ్గు

2023 అసెంబ్లీ ఎన్నికల వరకు నామమాత్రంగానే కనిపించినా.. పార్టీ ఆ తర్వాత బలపడినట్లు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో రుజువైంది. గతంలో మాదిరికన్న ప్రస్తుతం పార్టీ పరిస్థితులు మెరుగు పడినట్లు ఓటు బ్యాంకు ద్వారా తెలుస్తుంది. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటాలంటే పార్టీకి సరైన నాయకుడు అవసరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత రెండేళ్లుగా పార్టీని అన్ని రకాలుగా కాపాడుతూ వస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి వైపే పార్టీ మొగ్గు చూపుతుందన్న టాక్ వినిపిస్తోంది. అయితే సీనియర్ నేతలైనా గోక గణేష్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు కూడా డీసీసీ అధ్యక్ష పదవి కోసం పట్టుబడుతున్నట్లు తెలుస్తుంది. గత కొంత కాలం క్రితమే బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన తాంసి మండల నేత సురుకుంటి శ్రీధర్‌రెడ్డి పేరు కూడా తెరపైకి రావడం చర్చనీయాంశంగా మారింది. గత కొద్దిరోజులుగా ఆదిలాబాద్ నియోజకవర్గంలో కీలకంగా మారిన కంది శ్రీనివాస్‌రెడ్డి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పని చేయడంతో అధిష్ఠానం పెద్దలు ఆయన వైపే మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆదిలాబాద్ నియోజకవర్గంలో మెజార్టీ ఓట్లను సాధించడంతో ఆయనకు పార్టీలో ప్రత్యేకంగా గుర్తింపు దక్కింది. ఇలా అన్నిరకాలుగా డీసీసీ అధ్యక్ష పదవికి కంది శ్రీనివాస్‌రెడ్డి అర్హుడనే అభిప్రాయాలు పార్టీలో వ్యక్తమవుతున్నాయి.

ముగ్గురు నేతల మద్దతు ఉంటేనే..

జిల్లా పార్టీ అధ్యక్ష పదవి కోసం పలువురు నేతలు పోటీపడుతున్నా.. పార్టీలో కీలకంగా మారిన వారి మద్దతు ఉంటేనే పదవి దక్కడం ఖాయమన్న చర్చ జరుగుతుంది. ముఖ్యంగా జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కతో పాటు పార్లమెంట్ ఇన్‌చార్జి సత్తు మల్లేష్‌ల మద్దతు కీలకమన్న వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అభిప్రాయానికి కూడా ప్రాధాన్యతనిచ్చే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఈ నేతల మద్దతు ఉంటే డీసీసీ ఖాయమన్న టాక్ వినిపిస్తోంది. అయితే ఇప్పటికే ఈ ముగ్గురు నేతలు వేర్వేరుగా మద్దతు నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఫైనల్ నిర్ణయం ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడిదే అయినప్పటికీ.. ఈ ముగ్గురు నేతల అనుమతి ప్రకారమే తుది నిర్ణయం ఉంటుందని తెలుస్తుంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు జిల్లా నేతలతో చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. జిల్లా పార్టీ పరిస్థితులపై పూర్తిస్థాయి అవగాహన కూడా ఉంది. ఇప్పటికే అంతర్గతంగా కొంతమంది పార్టీ నేతల అభిప్రాయాలు కూడా సేకరిస్తున్నట్లు సమాచారం. పార్టీలో సీనియర్, జూనియర్ నేతల నేమాటను పక్కన పెడితే.. జిల్లాలో పార్టీని బలోపేతం చేసే నేతకే జిల్లా పార్టీ పగ్గాలు అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సంక్షిప్త సమాచారం



హైదరాబాద్‌లో సీఈ మోహన్‌తో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టండి : ఎమ్మెల్యే

నేరడిగొండ/బోథ్, సెప్టెంబరు 10: నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సీఈ మోహన్‌ను కోరారు. మంజూరైన రోడ్లకు టెండర్లు సకాలంలో పూర్తి చేయాలన్నారు. స్పందించి ఆర్ అండ్‌బీ ఇంజనీరింగ్ తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు మాట్లాడటం జరిగిందని ఎమ్మెల్యే వివరించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమలగౌడ్, తదితరులు ఉన్నారు.

● సెర్ప్ సీఈవోను కలిసిన బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ: సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌ను హైదరాబాద్‌లో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో ఆమె జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. బోథ్ నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, ఇచ్చోడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్‌గౌడ్, తదితరులున్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

ఇచ్చోడ, సెప్టెంబరు, 9: ఇచ్చోడ మండల కేంద్రంలోని ఆశోక్‌నగర్ కాలనీలో నూతన సీసీ రహదారి పనులకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్ మంగళవారం భూమిపూజ చేశారు. ఎంపీ ల్యాడ్స్ రూ.3లక్షలతో సీసీ రహదారికి నిధులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. నాణ్యతతో కూడిన రహదారిని నిర్మించాలని సంబంధిత గుత్తేదారుకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కెంద్రే నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, మాధవరావ్ ఆమ్టె, జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్, నాయకులు బాబారావ్, సునీల్ జాదవ్ రాము, అర్జున్, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణానికి భూమి పరిశీలన

మావల, సెప్టెంబరు 10: ఎస్సీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణం కోసం బట్టిసావర్గం శివారులో కేటాయించిన భూమిని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి భగత్ సునీత కుమారి మంగళవారం పరిశీలించారు. జిల్లాకేంద్రంలో ఎస్సై స్టడీ సర్కిల్ 8 ఏళ్లుగా ప్రైవేట్ బిల్డింగ్‌లోనే శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. అయితే ప్రభుత్వం భవన నిర్మాణం కోసం రెండు ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. త్వరలో బిల్డింగ్ నిర్మాణం కోసం ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. ఇందులో ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రమేష్, పూర్ణ చందర్, నారాయణరెడ్డి, కిరణ్, నసీర్, తదితరులు ఉన్నారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

● ఉట్నూర్‌లో ఐలమ్మ విగ్రహం ఏర్పాటు కృషి చేస్తా : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ● ఆదిలాబాద్‌లో ఘన నివాళ్లర్పించిన కలెక్టర్, అధికారులు



ఉట్నూర్‌లో ఐలమ్మ చిత్రపటానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

ఉట్నూర్, సెప్టెంబరు10: తొలి భూపోరాటానికి నాంది పలికిన ధీరవనిత ఉద్యమకారిణి చాకలి ఐలమ్మ అని దొరల పాలనను అంతమొందించడానికి ఆ మహనీయురాలు చేసిన కృషి పోరాటం మనందరికి స్ఫూర్తిదాయకమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ధీరవనిత చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూస్వాములు, దొరలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ నిరంతరం పోరాడారని, ఆ ధీరవనిత పోరాటాన్ని మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. త్వరలో ఉట్నూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు తనవంతుగా కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రజక సమాజానికి అండగా ఉంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. ఏ సమస్యలున్న తనదృష్టికి తీసుకురావాలని, ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, రజక సంఘం సభ్యులు మరికంటి నారాయణ, నేదునూరి అశోక్, కాల్వరవి, మహంకాళి, తదితరులు పాల్గొన్నారు.

● వీరవనితగా గుర్తింపు పొందిన ఐలమ్మ : కలెక్టర్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఎదుట చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటంలో వీరవనితగా గుర్తింపు పొందిన ఐలమ్మ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించి 2022 సెప్టెంబరు 22న ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. వరంగల్ జిల్లా, రాయపర్తి మండలం కిష్టాపురం గ్రామంలో 1895 సెప్టెంబరు 26న ఓరుగంటి మల్లమ్మ, సాయిలుకు నాలుగో సంతానంగా చాకలి ఐలమ్మ జన్మించిందని తెలిపారు. అలాగే వీరిది వెనుకబడిన కుటుంబం, చాకలి కులవృత్తే వారికి జీవనాధారం, పాలకుర్తికి చెందిన చిట్యాల నర్సయ్యతో ఐలమ్మ బాల్య వివాహం, వీరికి ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె అని తెలిపారు. 1940-44 మధ్య కాలంలో విస్నూర్‌లో దేశ్‌ముఖ్, రజాకర్ల అరాచకాలపై ఎదురు తిరిగి ఎర్రజెండా పట్టిందని అన్నారు. ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన ఐలమ్మ 1985 సెప్టెంబరు 10న అనారోగ్యంతో మృతి చెందారని పేర్కొన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరవనిత చాకలి ఐలమ్మ అని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజలింగు, ప్రజలు పాల్గొన్నారు.

● ఘన నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్: చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం కంది శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో రిమ్స్ ఆసుపత్రి ఎదుట ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ కలాల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు బండారిసతీష్, సందనర్సింగ్, యెల్మెల్వార్‌అర్చన రామ్‌కుమార్, మహిళ నాయకురాలు ఉమ, రమా, గంగామణి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మేడిని మార్చే అధికారం లేదు

● జిల్లా సమన్వయకర్త సిడాం భీంరావు



ఉట్నూర్‌లో తీర్మానాన్ని ప్రకటిస్తున్న ఆదివాసీ నాయకులు

ఉట్నూర్, సెప్టెంబరు 10: గొండ్వాన పంచాయతీరాయ్ సెంటర్ జిల్లా మేడి మేస్రం దుర్గు పటేల్‌ని మార్చే అధికారం రాజ్‌గోండు సేవా సమితికి లేదని సార్మేడిలు, పటేల్‌లు ఆదివాసీ జాతి పెద్దలు సమావేశమై అందరూ కలిసి మంగళవారం మండలకేంద్రంలోని గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన ఆదివాసీ సంఘాల నాయకుల సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మాం చేశారని జిల్లా సమన్వయకర్త సిడాంభీంరావు ప్రకటించారు. సోమవారం రాజ్‌గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు రాయిసెంటర్ రద్దుచేసి కొత్తగా రాయిసెంటర్ జిల్లా మేడిగా సిడాం ఫక్రు తనయుడు గంగాధర్‌ను నియమించినట్లు ప్రకటన చేయడం విడ్డూరం అన్నారు. ఇది ఆదివాసీ సమాజానికి విరుద్ధం అని జిల్లా మేడిని రద్దు చేసే అధికారం రాజ్‌గోండు సేవా సమితకి ఎక్కడిదని ప్రశ్నించారు. రాయ్‌సెంటర్‌కు, రాజ్‌గోండుసమితికి ఎటువంటి సంబంధం లేదని,అనాధిగా గ్రామంలో పటేల్ వ్యవస్థ ఉందని, పటేల్, దేవారి, మహాజన్, ఘట్యాల్ గ్రామస్థులు కలిసి రాయ్‌సెంటర్ కేంద్రంలో సార్‌మేడి నియామకం 40 నుంచి 46 గ్రామాలు కలిసి ఒక రాయ్‌సెంటర్ ఉంటుందని, ఈ సార్మేడిలు అందరు జిల్లాలోని 34 మంది సార్‌మేడిలు కలిసి ఏకగ్రీవంగా రాయ్‌సెంటర్ వార్షిక మహాసభ ప్రతియేటా డిసెంబరు 31న పటేల్ దేవారి మహాజన్‌ఘట్యాల్ ఆదివాసీ పెద్దలు మహిళా సభ్యులందరూ కలిసి నియామకం చేయడం ఆదివాసీల ఆనవాయితీగా వస్తుందన్నారు. అకస్మాత్తుగా జిల్లా మేడిని తీసి మరొక జిల్లా మేడిని ప్రకటించడం జాతి నియమ నిబంధనలకు విరుద్ధం అని ఉమ్మడి జిల్లా ఆదివాసీ సంఘాల సమన్వయకర్త అన్నారు. ఈ సమావేశంలో సార్మేడి నైతం చిత్రు, మండాడి దౌలత్‌రావు, కేస్లాపూర్ సార్మేడి మేస్రం వెంకట్‌రావు, వడ్‌గావ్‌సార్మేడి మేస్రం చిన్ను, ఉట్నూర్ సార్మేడి సలాందేవ్‌రావు, తదితరులున్నారు.



ఇచ్చోడలో శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌస్‌అలం

ఎక్కడ ఏ సమస్య వచ్చినా.. పోలీసులకు సమాచారం అందించాలి

● అందరూ సహకరిస్తే ప్రశాంతంగా వేడుకలు : ఎస్పీ

ఇచ్చోడ, సెప్టెంబరు 10: వినాయక నిమజ్జనం సందర్భంగా మీ ప్రాంతాలలో ఎక్కడ ఏ సమస్య వచ్చిన స్థానిక పోలీసులకు, డయల్ 100, జిల్లా పోలీస్ యంత్రాంగానికి సమాచారం అందించాలని జిల్లా పోలీసు ఉన్నతాధికారి గౌస్ అలం సూచించారు. వినాయక చవితి పండగను ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రాయల్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చోడ, నేరడిగొండ, సిరికొండ, బజార్‌హత్నూర్ మండల ముస్లీం సోదరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లడతూ.. నవరాత్రోత్సవాలు సజావుగా ముగిసేలా అన్ని చర్యలు చేపడతున్నామన్నారు. నిమజ్జనం రోజున బారికేడ్లు, పోలీసుల బందోబస్తు తదితర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నిమజ్జనం రోజుల ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడలన్నారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యలతో నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సిహెచ్ నాగేందర్, సీఐలు భీమేష్, నవీన్, ఎస్సైలు నరేష్, శ్రీకాంత్, ఇమ్రాన్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● 'ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తి చేసుకోవాలి'

బోథ్: మండలంలోని కౌటా(బి) గ్రామంలో రాక్స్ యూత్ వారు ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహానికి సోమవారం బోథ్ సీఐ రమేష్, ఎస్సై ప్రవీణ్‌లు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా మండపం వారి ఆహ్వానం మేరకు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు మండపం వారు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐలు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తి చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు గణేష్ మండలి అధ్యక్షుడు సోమేశ్వర్, వెండి రమేష్, తదితరులు ఉన్నారు.



కర పత్రాలను ఆవిష్కరిస్తున్న రిమ్స్ డైరెక్టర్, డీఎంహెచ్‌వో

క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోవద్దు

ఆదిలాబాద్, సెప్టెంబరు 10: క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోవద్దని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో డీఎంహెచ్‌వో కె.కృష్ణ, ఎన్‌సీడీ పీవో ఎం.శ్రీధర్‌తో కలిసి టెలిమనస్ టోల్ ఫ్రీ నెం.14416 కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్, డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆత్మహత్య అనే ధోరణి యువత, మధ్య వయస్కుల్లో అధికంగా ఉందన్నారు. ఇందుకోసం ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతీ సంవత్సరం సెప్టెంబరు 10వ ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం జరుపుకుంటున్నారన్నారు. రిమ్స్‌లో మానసిక వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. అలాగే సైక్రియాటిక్ విభాగంలో 16 బెడ్లతో కూడిన ఇన్ పేషెంట్ సౌకర్యం ఉందన్నారు. వచ్చిన పేషెంట్లకు వైద్యులు కౌన్సిలింగ్ అందించడతో పాటు చికిత్స కూడా చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రొఫెసర్, మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఎల్ ఓంప్రకాష్, సైకాలజిస్ట్ శ్రీకాంత్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్, సామాజిక కార్యకర్త చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

● ఐసీటీసీ కౌన్సెలర్ ఉద్యోగానికి దరఖాస్తులు

ఆదిలాబాద్: మొబైల్ ఐసీటీసీ కౌన్సెలర్ పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో కృష్ణ తెలిపారు. సైకాలజీ, సోషల్ వర్క్, సోషియాలజీ, ఆంత్రోపాలజీ, హ్యూమన్ డెవలప్‌మెంట్, నర్సింగ్‌లో గ్రాడ్యుయేట్ డిగ్రీ హోల్డర్, నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్ కింద కౌన్సెలింగ్, విద్యలో మూడు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు ఫారంలను ఈనెల 13వ తేదీ వరకు కుష్ఠ నివారణ కార్యాలయంలో అందజేయాలని ఆయన పేర్కొన్నారు.

స్కౌట్ మాస్టర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్, సెప్టెంబరు 10: బేసిక్ స్కౌట్ మాస్టర్ శిక్షణ పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలకు చెందిన ఆసక్తి గల ఉపాధ్యాయులు శిక్షణ పొందవచ్చన్నారు. ఈనెల 18 నుంచి 25 వరకు హైదరాబాద్‌లోని దోమలగూడలో శిక్షణ శిబిరం నిర్వహిస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి స్వామి ఫోన్ నెం.9848736476 ద్వారా సంప్రదించాలని సూచించారు.

బోథ్‌లో రోడ్డుపై ట్రాఫిక్ ఇక్కట్లు

బోథ్, సెప్టెంబరు 10: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వ్యాపారులు తమ విక్రయ సామగ్రిని పెట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లకు ఇరువైపులా విక్రయ సామగ్రితో పాటు వాహనాలను నిలపడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరతున్నారు. గ్రామ పంచాయతీ వారు ఈ విషయమై తక్షణమే చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



బోథ్‌లో ప్రధాన రహదారిపై ఇబ్బందులు పడుతున్న ప్రజలు

'ఆశా కార్యకర్తల పనిభారం తగ్గించాలి'

ఆదిలాబాద్, సెప్టెంబరు 10: ఆశా కార్యకర్తలపై పని భారాన్ని తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆదిలాబాద్ డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న సర్వే బిల్లులను వెంటనే చెల్లించాలని, ఆశా కార్యకర్తలకు కనీస వేతనం చెల్లించాలని పేర్కొన్నారు.

టీకాలతో వ్యాధులను అరికట్టవచ్చు

తలమడుగు, సెప్టెంబరు 10: పశువులకు వచ్చే వ్యాధులను ముందస్తుగా టీకాలతోనే అరికట్టవచ్చని మండల పోస్టు వైద్య అధికారి డాక్టర్ రుద్రం రాథోడ్ అన్నారు. మంగళవారం మండలంలోని అర్లి(కె) ఝరి గ్రామంలో గొర్రెలు, మేకలకు దగ్గు, దమ్ముతో పాటు పారుడు రోగం టీకాల శిబిరం ఏర్పాటు చేశారు.

గ్రామాలను సందర్శించిన డీఆర్‌డీవో

భీంపూర్, సెప్టెంబరు 10: ఆదిలాబాద్ డీఆర్‌డీవో సాయన్న మంగళవారం భీంపూర్ మండలంలోని మార్కగూడ, వడ్గం పంచాయతీలను సందర్శించారు. పల్లె ప్రకృతి వనం, నర్సరీలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, ఎంపీవో అతుల్‌కుమార్, ఏపీవో సంగీత, ఈసీ నరేందర్, కార్యదర్శులు శ్రావణి తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్, సెప్టెంబరు 10: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్, మానవ అక్రమ రవాణ, టోల్ ఫ్రీ నెంబర్లు తదితర వాటిపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతులను అనుసరిస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 10: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మంగళవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్‌తో కలిసి సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని ఎమ్మెల్యే అన్నారు. రానున్న ఏ ఎన్నికలైనా సరే బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆదినాథ్, మయూర్ చంద్ర, పట్టణాధ్యక్షుడు లాలా మున్న, వకుళాభరణం ఆదినాథ్, లింగారెడ్డి, పాయల్ శరత్, దినేష్ మటోలియా పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ఆదిలాబాద్, సెప్టెంబరు 10: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పెండింగ్ బిల్లులతోపాటు వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రాములు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన డీఈవో

భీంపూర్, సెప్టెంబరు 10: భీంపూర్ మండలం అర్లి(టి), భీంపూర్, దన్నోరా పాఠశాలలను డీఈవో ప్రణీత మంగళవారం సందర్శించారు. 10వ తరగతి విద్యార్థుల మ్యాథ్స్ పరీక్షను పరిశీలించారు. ఆ తర్వాత ధన్నోరా గ్రామంలోని పాఠశాలలో ఒక విద్యార్థి పాముకాటుకు గురి కాగా, ఉపాధ్యాయుడు సురేష్ రక్షించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బడి పక్కన పొదలు తొలగించాలని సూచనలు చేశారు. డీఈవోతో ఎంఈవో శ్రీకాంత్, ఉపాధ్యాయులు శ్యామ్‌సుందర్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీని సందర్శించిన ఈశ్వరీబాయి

ఉట్నూర్, సెప్టెంబరు 10: మండలంలోని దంతన్‌పల్లి నాగాపూర్ (కోలాం గూడ)లో ఉన్న ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలకు, గర్భిణీ, బాలింతలకు అందిస్తున్న పౌష్టిక ఆహారం, సరుకులు, హాజరు, తదితర వాటి వివరాలు అంగన్‌వాడీ టీచర్ లక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. ఐటీడబ్ల్యుఏసీ డైరెక్టర్ ముచ్చేనేని భూమన్న ఉన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

నేరడిగొండ, సెప్టెంబరు 10: రైతులు పాడి పశువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి రాథోడ్‌జీవన్ అన్నారు. మంగళవారం మండలంలోని దర్బా, దర్బాతాండ, బందం, మాదాపూర్ గ్రామాలలో 980 మేకలకు పొరుడు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్‌మాట్లాడుతూ వర్షాకాలంలో వాగులలో కలుషీత నీరు తాగడం వలన రోగుల భారీన పడే అవకాశం ఉందని పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని రోగాల భారీన పడితే వెంటనే ఆసుపత్రికి తీసుకుని చికిత్సలు చేయించుకోవాలన్నారు. ఇందులో పశువైద్యాధికారి సుశీల్‌కుమార్, నరేందర్, శివప్రసాద్, వెంకన్న, రాజన్న, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు : ఈవో

బోథ్, సెప్టెంబరు 10: మండల కేంద్రంలో దోమల నివారణకు తగు చర్యలు చేపట్టడం జరిగిందని గ్రామ పంచాయితీ ఈవో పి.అంజయ్య తెలిపారు. ప్రజలు సైతం ఇళ్ల చుట్టూ నీరు నిల్వకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇళ్లలో నీరు నిల్వ ఉంటే డెంగ్యూ దోమలు పెరిగే ఆస్కారం ఉంటుందన్నారు. ప్రజలు పారిశుధ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.



బురదమయమైన రోడ్డులో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఇంద్రవెల్లిలో గుంతలమయమైన రోడ్లు

● స్థానికుల ఇక్కట్లు.. పట్టించుకోని అధికారులు

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 10: మండలంలోని వివిధ గ్రామాలలో రహదారులు గుంతలమయంగా మారి అధ్వాన్నంగా మారాయి. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్వానంగా తయారైన రహదారులకు మోక్షం ఎప్పుడోనని మండల ప్రజలు పేర్కొంటున్నారు. మండలంలోని సట్వాజీగూడ, మర్కగూడ, బుర్సన్ పటార్, ఆదిలాబాద్ మండలంలోని చిచ్‌ధరి, ఖానాపూర్ పలు గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వాన్నంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పడి అధ్వాన్నంగా మారి ద్విచక్ర వాహనాలు కూడా తిరుగలేని పరిస్థితి దాపురించింది. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. తక్షణమే అధికారులు ప్రజల ఇబ్బందులను గుర్తించి రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రయాణీకుల ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ఇచ్చోడలో నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు



బోథ్‌లో వీరనారి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రజకులు



తలమడుగులో నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి

● ఆదిలాబాద్‌లో జిల్లావ్యాప్తంగా 39వ వర్ధంతి వేడుకలు

ఇచ్చోడ, సెప్టెంబరు 10: భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం విరోచిత పోరాటం చేసిన చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతీఒక్కరూ పోరాడాలని రజక సంఘం అధ్యక్షుడు అరుగుల గణేష్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో వీరనారిచాకలి ఐలమ్మ పాత్ర మరువలేనిదని గుర్తుచేశారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేఖంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆమె పోరు మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు నాగరాజ్ దేవారాజ్, కోశాధికారి గంగాధర్ సభ్యులు శేఖర్, భూమన్న, ప్రణయ్, సాయి, సురేష్, రాజు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

తలమడుగు: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు భూమి కోసం, భుక్తి కోసం ఆత్మ గౌరవం కోసం విరోచితంగా పోరాడిన వీర వణిత చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి వేడుకలు మంగళవారం మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో రజక సంఘం మండల అధ్యక్షుడు జక్కుల ఆశన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు లింగన్న, మాజీ ఎంపీటీసీ చంటి రజక సంఘం నాయకులు చిన్న లింగన్న, స్వామి, దత్తు, భూమన్న, శివన్న, అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు దేవన్న, ధర్మ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి కార్యక్రమాన్ని రజకులు మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ పోరాటం ఆమె చేసిన త్యాగాలను వివరించారు. భూమికోసం ఆత్మ గౌరవం కోసం పోరాటం చేసిన వీరనారని పలువురు పేర్కొన్నారు. ఆమె పోరాట పటిన నేటి తరానికి అవసరమన్నారు. ఇందులో రజక సంఘ అధ్యక్షుడు చిలుకూరి భోజన్న, ఉపాధ్యక్షుడు రమేష్, కోశాధికారి ఎల్ నరేష్, సంఘ పెద్దలు గంగారాం, మంచికుంట లచ్చన్న, సంతోష్, నరేష్, శ్రావణ్, సతీష్, మహేందర్, చిన్నయ్య, బండి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్లను చీల్చి చెండాడిన చాకలి ఐలమ్మ జీవితం అందరికి ఆదర్శమని రజక సంఘం మండల అధ్యక్షుడు శంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని తేజాపూర్‌లో నిర్వహించి వర్ధంతి వేడుకల్లో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూమికోసం భుక్తి కోసం బానిస బతుకుల విముక్తి కోసం తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిందన్నారు. ఆమె స్ఫూర్తితో ముందడుగు వేయాలని కోరారు. ఇందులో రజక సంఘం మండల ఉపాధ్యక్షుడు సిర్ర దశరథ్, రమణ, సతీస్, గంగయ్య, జంగంపల్లి రమేష్, శ్రీనివాస్, రాజు, తదితరులున్నారు.



నేరడిగొండ మండలం తేజాపూర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రజక సంఘం నాయకులు

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలి

● తలమడుగు తహసీల్దార్ రాజమోహన్

తలమడుగు, సెప్టెంబరు 10: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. అంతేకాకుండా ప్రతీ విద్యార్థి ఆరోగ్య విషయాలు తలిసి ఉండేలా కేంద్రాలకు ప్రభుత్వం సన్న బియ్యం అందిస్తుందన్నారు. అనంతరం రిజిష్టర్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, అంగన్‌వాడీ కార్యకర్తనేతుల మంజుల, అయమ్మ వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

● పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఇంద్రవెల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఉట్నూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషణ మహా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్నూర్ సీడీపీవో మాస ఉమాదేవి, గర్భిణులకు బాలింతలకు, కిషోర బాలికలకు పోషక ఆహారం, చిరు ధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి అలాగే పోషణ్ పక్వాడా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గర్భినులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేకదృష్టి పెట్టాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. అంతేకాకుండా పౌష్టికాహారంతో పాటు కూరగాయాలను కూడా బాగా తీసుకోవాలన్నారు. అందువల్ల కలిగే లాభాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ కాంబ్లే పురుషోత్తం, హెల్త్ సూపర్ వైజర్ పవార్‌సురేష్, అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు, గర్భిణులు, కిషోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్



బోథ్‌లో పాల్గొన్న సీడీపీవో, అంగన్‌వాడీ కార్యకర్తలు,



అంగన్‌వాడీ కేంద్రంలో రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

● పోషకాహారంతోనే తల్లీపిల్లలు ఆరోగ్యం : సీడీపీవో

బోథ్: గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకుంటే తల్లి పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో సౌందర్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏడవ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు తల్లి పిల్లల ఆరోగ్యం కోసం ఆకు కూరలు, కూరగాయలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. లేకుంటే పుట్టబోయే బిడ్డ అనారోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్‌లు మంజుల శారదతో పాటు అంగన్‌వాడీ టీచర్లు వచల, శాంత, సత్యభామ, వసంత, లలిత, రజిత, సహారా బాన్ ప్రేమల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న పప్పుల ధరలు

● కందిపప్పు కిలో రూ. 220 ● కాగుతున్న మంచినూనె ధరలు



ముథోల్, సెప్టెంబరు 10 : పప్పు దినుసుల ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. దీంతో సామాన్యుడికి ఇబ్బందులు తప్పడం లేదు. రెండు మాసాల క్రితం కందిపప్పు కిలో రూ. 140కి లభ్యమయ్యేది. ప్రస్తుతం నిర్మల్ జిల్లాలోని రిటైల్‌మార్కెట్‌లో రూ. 180 నుంచి 220 వరకు విక్రయిస్తున్నారు. ధరలు చుక్కలనంటుతుండడంతో సామాన్యుడికి పప్పు అన్నం కరువవుతోంది. రానున్న రోజుల్లో కందిపప్పు ధర డబుల్ సెంచరీకి చేరినా ఆశ్చర్యం లేదని వ్యాపారులు అంటున్నారు. ఒక కందిపప్పే కాకుండా అన్ని పప్పు దినుసుల ధరలు పెరిగాయి. మొన్నటి వరకు పెసరపప్పు కిలో రూ.100 ఉండగా, అది కాస్తా రూ.110 వరకు పలుకుతోంది. రాష్ట్రంలో గత ఏడాది కంది పంటసాగు తగ్గిపోవడంతో దీని ప్రభావం ధరలపై పడింది. నాణ్యమైన కందిపప్పు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతోంది. నిర్మల్ జిల్లాలో కంది, మినుము, పెసరసాగు ఆశించిన స్థాయిలో సాగు కావడం లేదు. మినుపప్పు ధర కిలో 130, శనిగపప్పు ధర కిలో రూ.90 పలుకుతుంది. జిఅల్లలో ఈ సంవత్సరం 4,33,300 ఎకరాల వివిధ పంటలు సాగు కాగా సుమారు పత్తి 1,68,000ల ఎకరాలు, వరి 1,35,000 ఎకరాలు, సోయాబీన్ 1,01,000 ఎకరాలు, మొక్కజొన్న 18,000 ఎకరాలు, కంది 10,000 ఎకరాలు ఇతర పంటలు వేయి ఎకరాలు సాగు చేస్తున్నారు.

ఘాటెక్కిన మసాలా దినుసులు...

నిత్యం వంటకాల్లో వినియోగించే మసాలాల ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. ముఖ్యంగా మాంసాహార వంటకాలలో మసాలాలు లేనిదే అసలు వంటలు చేయడం సాధ్యం కాదని, శాకాహార వంట కాలకు మసాలా దట్టిస్తే ఆ రుచే వేరు. ప్రతి చిన్న కార్యక్రమానికి బిర్యానీ వండి వడ్డించడం పరిపాటైంది. జీలకర్ర, ధనియాలు, మెంతులు, ఆవాలు వినియోగం ఎక్కువే. కొన్ని నెలలుగా మసాలా ధరలు ఓపెన్ మార్కెట్‌లో మండిపోతున్నాయి. జాజికాయ, జాపత్రి, ఇలాచీ, బిర్యానీ ఆకు తదితర మసాలా దినుసులు కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి తెలుగు రాష్ట్రాలకు దిగుమతి అవుతున్నాయి. యాలకుల ధర గతంలో కిలో రూ. 1700లకు లభ్యమయ్యేవి. ప్రస్తుతం కిలో రూ. 3000 నుండి 3500లకు చేరాయి. లవంగాల ధర రూ. 800లు కాగా, ప్రస్తుతం రూ. 1000 నుండి 1100లకు ఎగబాకింది. ఇలా గత రెండు, మూడు నెలల నుంచి దాదాపు అన్ని మసాలాల ధరలు పెరిగిపోయాయి. హోల్‌సేల్ ధరలు పెరిగాయి.

పెరిగిన నూనె ధరలు...

మంచి నూనె ధరలు కూడా రోజురోజుకు పెరిగిపోతున్నాయని సామాన్యుడు పేర్కొంటున్నాడు. వేరు శనగ నూనె కిలో రూ. 170లు, సన్‌ఫ్లవర్ ఆయిల్ కిలో రూ. 120 నుండి 140 వరకు పెరిగిపోయాయని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ధరలను నియంత్రించి సామాన్యులకు ఇబ్బంది కలగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



చాకలి ఐలమ్మ ఆశయాల సాధనకు కృషి చేయాలి

● నిర్మల్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్

నిర్మల్, సెప్టెంబరు 10 : చాకలి ఐలమ్మ ఆశయాల సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మరువలేనిదని గుర్తు చేశారు. నాటి కాలంలోనే దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసి తెలంగాణ పోరాటాల చరిత్రలో ఒక గొప్ప అధ్యయనాన్ని లిఖించిందని తెలిపారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో మనమంతా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. చాకలి ఐలమ్మ లాంటి వీర వనితల చరిత్రను భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. పీఎం విశ్వకరమ్మ యోజన పథకంలో భాగంగా జిల్లాలో రజకులకు శిక్షణ కేంద్రాల ద్వారా భృతితో కూడిన శిక్షణను అందించి, గుర్తింపు పత్రాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన రజకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్, పరిశ్రమల శాఖ అధికారి నరసింహ రెడ్డి, కుల సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 10 : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట గల ఆమె విగ్రహానికి మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భూమి కోసం భుక్తి కోసం రజాకార్లతో వీరోచితంగా పోరాటం చేసి ఆదర్శంగా నిలిచిందని ఈశ్వర్ అన్నారు. కమిషనర్ సీవీఎన్ రాజు, కౌన్సిలర్లు బిట్లింగ్ నవీన్, ఎడపల్లి నరేందర్, ఇమ్రానుల్లా, ముజాహిద్ చావుస్, మజిదొద్దీన్, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న నిర్మల్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

సోన్ మండల కేంద్రంలో..

సోన్, సెప్టెంబరు 10 : సోన్ మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం బీజేపీ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు మార గంగా రెడ్డి, మేకల అశోక్, నరేష్, నర్సయ్య, శ్రీనివాస్, రాము, బాలకృష్ణ, అమృత్, రాజు, మారుతి, రమణ, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

ముథోల్‌లో మండల కేంద్రంలో..

ముథోల్, సెప్టెంబరు 10 : మండల కేంద్రమైన ముథోల్‌లో మంగళవారం రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పుకణిక మన తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ అని అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళులర్పించారు. నాటి తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఆ యోధురాలు ప్రదర్శించిన ధైర్య సాహసాలు, చైతన్యం నేటి తరానికి ఎంతో స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం తాలూకా అధ్యక్షుడు రోళ్ల రమేష్; బీజేపీ మండల అధ్యక్షుడు కోరి పోతన్న, మాజీ ఎంపీటీసీలు పోతన్న యాదవ్, భూమేష్, నాయకులు తాటివార్ రమేష్, శ్రీనివాస్, మోహన్ యాదవ్, రజక సంఘం సభ్యులు రమేష్, మహేష్, గంగాధర్, బాలాజీ, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.



సోన్ మండల కేంద్రంలో..



ముథోల్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోండి

● నిర్మల్ జిల్లాలో గణేష్ మండపాల వద్ద టీజీఆర్టీసీ పథకాల గురించి ప్రచారం



ఆర్టీసీ పథకాల గురించి వివరిస్తున్న దృశ్యం

సోన్ రూరల్, సెప్టెంబరు 10 : మండలంలోని కడ్తాల్ గ్రామంలో మంగళవారం నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఆదేశాల మేరకు రిజర్వేషన్ సిస్టం ఇన్‌చార్జి టీవీ రమణ గణేష్ మండపాల వద్ద, గ్రామస్థులకు, యువకులకు ఆర్టీసీ అందిస్తున్న పథకాల గురించి వివరించారు. పెళ్లిళ్లకు, శుభకార్యాలకు అతి తక్కువ ధరలకే బస్సులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఆండ్రాయిడ్ ఫోన్‌లో గూగుల్ స్కానర్ ద్వారా ఆర్టీసీకి సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఆర్టీసీకి సంబంధించిన పది రకాల యాప్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని ఉపయోగించుకుంటే ఆర్టీసీ గురించి అన్ని వివరాలు తేసుకోవచ్చని రిజర్వేషన్ సిస్టం ఇన్‌చార్జి టీవీ రమణ తెలిపారు. ఈ స్కానర్‌లో గమ్యం యాప్ ఉంటుంది. దీనిని క్లిక్ చేస్తే మీరు ఎక్కవలసిన బస్సు ఎక్కడుందో... ఎక్కడి వరకు వచ్చిందో చూసుకోవచ్చని, అలాగే బస్సు టికెట్ బుక్ చేసుకునే యాప్ కూడా దీనిలోనే ఉంటుందని, ఆర్టీసీ అఫీషియల్ వెబ్‌సైట్, తెలంగాణలో నడుస్తున్న అన్ని బస్సుల సమాచారం ఉంటుందన్నారు. ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ అన్ని వివరాలు ఈ ఒక్క స్కానర్‌తో సాధ్యమని ఆయన సూచించారు. పలువురికి స్కానర్ ద్వారా యాప్ ఇన్‌స్టాల్ చేయించి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిర్గాపూర్ సాయరెడ్డి, విద్యార్థులు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.4। కనిష్ఠం 24.7





నష్టం అంచనాలు ఆలస్యం

- జిల్లా ఉన్నతాధికారి హెచ్చరించే వరకు కదలని యంత్రాంగం
- జిల్లావ్యాప్తంగా బాధితులకు ఊరడింపు కరువు
- మంత్రి పర్యటించినా దక్కని భరోసా
- అయోమయంలో అన్నదాతలు

నిర్మల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా పంటలు, ఆస్థులు నష్టపోయిన వారిని ప్రభుత్వం ఇప్పటి వరకు ఆశించిన రీతిలో ఆదుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వరదల కారణంగా పెద్దఎత్తున పంటపొలాల్లో ఇసుక మేటలు వేయడం, పంటలు నీట మునగడంతో పాటు ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని అనేక రోడ్లు వంతెనలు కొట్టుకుపోయాయి. అలాగే చాలా ఇళ్లు కూలిపోయి ఆ ఇళ్లల్లో నివసించే వారంతా నిరాశ్రయులయ్యారు. నీటిపారుదల, విద్యుత్‌శాఖ పరిధిలో కూడా పెద్ద మొత్తంలోనే నష్టం వాటిల్లింది. అయితే ప్రతీఏటా వరదల వల్ల నష్టపోయిన పంటలు, ఆస్థులు, రోడ్లు, వంతెనలకు సంబంధించి నష్టం అంచనాలను అధికారులు ఆఘమేఘాల మీద రూపొందించి ప్రభుత్వానికి నివేదించేవారు. అయితే దశల వారీగా నష్టం అంచనాలు రూపొందించబడేవి. ఈసారి మాత్రం సంబంధిత శాఖల అధికారుల మధ్య సమన్వయం కొరవడడమే కాకుండా సర్కారు నుంచి స్పష్టమైన సంకేతాలు రాని కారణంగా ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో నష్టం అంచనాలను రూపొందించకుండా జాప్యం చేశారంటున్నారు. రెండు రోజుల క్రితం ప్రత్యేకాధికారిగా నియమించబడ్డ సీనియర్ ఐఏఎస్ భవేష్ మిశ్రా హెచ్చరించే వరకు యంత్రాంగం అంచనాల కోసం రంగంలోకి దిగకపోవడం విమర్శలకు తావిస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు సైతం నష్టం అంచనాల విషయంలో ఆలస్యం చేయడం పట్ల అంతటా అసంతృప్తి వ్యక్తమవుతోందని అంటున్నారు. ముఖ్యంగా పలుశాఖల అధికారులు నష్టం విషయంపై పెద్దగా స్పందించకపోవడం పట్ల కూడా జిల్లా ప్రత్యేకాధికారి ఇటీవలే ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే జిల్లా ప్రత్యేకాధికారి హెచ్చరికల నేపథ్యంలో వ్యవసాయ, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ, విద్యుత్‌శాఖల అధికారులు తమ క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసి తాత్కాలిక నష్టం అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. అయితే మరోసారి కూడా పూర్తిస్థాయిలో నష్టం అంచనాలను రూపొందించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఈ రూపొందించే నష్టం అంచనాలన్నీ సర్కారుకు అందిన తరువాత ప్రభుత్వం అధికారులు ఇచ్చిన నివేదికల్లోని తీవ్రత ఆధారంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇప్పటి వరకు నష్టపోయిన పంటలు, ఆస్థులకు పరిహారం ఇచ్చే అంశంపై ప్రభుత్వం కూడా పూర్తిస్థాయిలో స్పష్టతనివ్వకపోయినప్పటికీ బాధితుల సంఖ్య, ఆస్థుల నష్టం వివరాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం ఆసక్తి చూపుతోంది. అయితే వరదల వల్ల చాలా మంది పేదల ఇళ్లు నేలమట్టం కాగా ఇప్పటికి పంటపొలాల్లో ఇసుకమేటలే దర్శనమిస్తున్నాయి. రోడ్లు, వంతెనలు తెగిపోయిన కారణంగా అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే విద్యుత్‌శాఖ అధికారులు మాత్రం వరద తీవ్రత ముగియగానే అంచనాలను రూపొందించేందుకు రంగంలోకి దిగడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

రోడ్లు, వంతెనలకు భారీ నష్టం

జిల్లాలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ శాఖ పరిధిలోని రోడ్లు, వంతెనలు, భవనాలు పెద్దఎత్తున దెబ్బతిన్నాయి. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో మొత్తం 132 రోడ్లు, 237 కిలోమీటర్ల పొడవుతో వేరు వేరు చోట్ల పూర్తిగా ధ్వంసమయ్యాయి. కాగా ఈ శాఖ అధికారులు ఒకటి రెండు రోజుల్లోనే ప్రాథమిక నష్టం అంచనాలను రూపొందించారు. మొత్తం 11 కోట్ల రూపాయల అంచనాలు రూపొందించి సర్కారుకు నివేదించారు. అలాగే ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోని 30 రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. 74 కిలో మీటర్ల పొడవుతో రోడ్లు దెబ్బతిన్నాయని, వీటి మరమ్మతుల కోసం రూ.2.14 కోట్లు అవసరమవుతాయంటూ ఆర్అండ్‌బీ శాఖ అధికారులు అంచనాలను రూపొందించారు.

పంటలు, ఆస్థులకు నష్టం

కాగా జిల్లాలో వరదల కారణంగా పెద్దమొత్తంలోనే పంటలు నష్టపోయినట్లు రైతులు వాపోతున్నారు. అధికారులు ప్రాథమికంగా సర్వే నిర్వహించి 463 ఎకరాల్లో వివిధ రకాల పంటలు వర్షం కారణంగా నష్టపోయాయని చెబుతున్నారు. ముఖ్యంగా సోయాబిన్ పంటతో పాటు పత్తి పంట ఈ సారి గణనీయంగా నష్టపోయిందని అంటున్నారు. అలాగే జిల్లాలో ప్రైవేటు ఆస్థులు కూడా పెద్దఎత్తున ధ్వంసమయ్యాయని చెబుతున్నారు. మొత్తం 114 ఇళ్లు పాక్షికంగా దెబ్బతినగా నాలుగు ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో పాటు పశువులు కూడా పెద్దసంఖ్యలో మృతి చెందాయని పేర్కొంటున్నారు. పంట నష్టంకు సంబంధించి పరిహారం అందించే విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయని కారణంగా రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పష్టంగా పంట నష్టపోయిన రైతులకు ఎంత మేరకు పరిహారం అందిస్తుందోనన్న అంశాన్ని వెల్లడించాల్సి ఉండేది.

విద్యుత్ శాఖకు తప్పని నష్టం

కాగా ఈ సారి వరదలకు తోడుగా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు కూడా తీవ్ర ప్రభావం చూపాయి. ముఖ్యంగా వర్షాలతో విద్యుత్ శాఖకు మరోసారి భారీ నష్టం వాటిల్లిందని అంటున్నారు. చాలా చోట్ల విద్యుత్ స్థంభాలు దెబ్బతిన్నాయని, కండక్టర్‌లు సైతం దెబ్బతింటున్నాయని పేర్కొంటున్నారు. దాదాపు రూ. 6లక్షలకు పైగా విద్యుత్ శాఖకు నష్టం జరిగిందని అంటున్నారు. అలాగే నీటి పారుదల శాఖ పరిధిలోని చెరువులకు చాలా చోట్ల బుంగలు పడడమే కాకుండా వాటి కాల్వలు దెబ్బతిన్నాయని పేర్కొంటున్నారు. దీనికి సంబంధించి ఇరిగేషన్ శాఖ అధికారులు రూ. 27 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారని అంటున్నారు. మొత్తానికి వరుసగా కురిసిన భారీ వర్షాలు జిల్లాకు పెద్దమొత్తంలోనే నష్టం చేకూర్చాయని అంటున్నారు.



వరదనష్టం వివరాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను అడిగి తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి భవేష్‌మిశ్రా (ఫైల్)

గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



లక్ష్మణచాందలో గణేష్ మండలిని సందర్శించిన డీఎస్పీ గంగారెడ్డి, సీఐ నవీన్, ఎస్సై సుమలత, తదితరులు

లక్ష్మణచాంద, సెప్టెంబరు 10 : గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ గంగారెడ్డి మంగళవారం అన్నారు. మండలంలో పర్యటించిన ఆయన గణేష్ మండళ్లను సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలన్నారు. నియమ నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సోన్ సీఐ నవీన్‌కుమార్, ఎస్సై సుమలత, పోలీసులు ఉన్నారు.

నిమజ్జన శోభాయాత్రకు ఏర్పాట్లు



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, అధికారులు

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 10 : జిల్లాకేంద్రంలో వినాయక శోభాయాత్ర అంతరాయాలు కలగకుండా ఉండేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చైర్మన్ ఈశ్వర్ తెలిపారు. విద్యుత్ తీగల సవరణ పనులను మంగళవారం అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పరిశీలించారు. అధికారుల సమన్వయంతో శోభాయాత్ర నిర్వహణ ఏర్పాట్లు చేస్తున్నారని వివరించారు. కమిషనర్ సీవీఎన్ రాజు, విద్యుత్ అధికారులు, కౌన్సిలర్లు ఆయన వెంట ఉన్నారు.

'బీజేపీ సభ్యత్వ నమోదుకు అపూర్వ ఆదరణ'



మునిపెల్లిలో మాట్లాడుతున్న పార్టీ మండల కన్వీనర్లు అడ్వాల రమేష్, పొలాస గోవర్ధన్

లక్ష్మణచాంద, సెప్టెంబరు 10 : బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభిస్తుందని ఆ పార్టీ మండల కన్వీనర్లు అడ్వాల రమేష్, పొలాస గోవర్ధన్‌లు మంగళవారం అన్నారు. మండలంలోని చామన్‌పెల్లి, చింతల్ చందా, మునిపెల్లి, మల్లాపూర్, మాచాపూర్ గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుకు ఆకర్షితులై పలువురు యువకులు స్వచ్ఛందంగా సభ్యత్వం స్వీకరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్లు చందు, అయిండ్ల శ్రీధర్‌రెడ్డి, గుడ్ల రంజిత్, కమల్ కోట వెంకట్ రెడ్డి, నాయకులు షేరు రాజారెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రజాపద్దుల కమిటీ సభ్యుడిగా

ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్



పవార్ రాంరావ్ పాటిల్

భైంసా, సెప్టెంబరు 10 : తెలంగాణ శాసనసభ అర్థిక కమిటీలలో భాగంగా 2024-25 అర్థిక సంవత్సరం కోసం నియమింపబడిన ప్రజాపద్దుల కమిటీలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్‌కు చోటు దక్కింది. సోమవారం అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచారి కమిటీ నియమాకపు వివరాలను వెల్లడించారు. ఇందులో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ ప్రజాపద్దుల కమిటీ చైర్మెన్‌గా , 8 మంది ఎమ్మెల్యేలు, 4 గురు ఎమ్మెల్సీలతో కలిపి మొత్తం 12 మందిని సభ్యులుగా నియమిస్తూ కమిటీని విడుదల చేశారు. ఇందులో కమిటీ సభ్యునిగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్‌కు స్థానం దక్కింది.

మహిళలు మరింత ఆర్థికంగా ఎదగాలి

- డీఆర్‌డీవో విజయలక్ష్మి



స్పోర్ట్స్ షాపును ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో పీడీ

ముథోల్, సెప్టెంబరు 10 : మహిళలు మరింత ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీవో విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లో మంగళవారం మండల కేంద్రంలో వరలక్ష్మి గ్రూప్‌కి చెందిన స్వయం సహాయక సంఘ సభ్యురాలు సరిగిరి సాయిబాయి మహిళా శక్తి పథకం కింద రూ. 3 లక్షల రుణంతో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ షాపును డీఆర్‌డీవో పీడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... స్వయం శక్తి సంఘాలకు బ్యాంక్ ద్వారా రుణాలు అందజేసి వారి వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు మహిళలకు అవసరమైన సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తున్నామని, మహిళా సంఘాలచే మీసేవ కేంద్రాలు ఆహార శుద్ధి కేంద్రాలు, పౌల్ట్రీ యూనిట్ మొదలగు వివిధ వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమర్థవంతంగా నిర్వహించుకొని మహిళలు ఆర్థికంగా తమ కాళ్ల మీద తాము నిలవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ అవకాశాలను వినియోగించుకుంటూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధన దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శిరీష రెడ్డి, డీపీఎం సాయిప్రసాద్, ఏపీఎం గురుచరణ్, సాయిప్రసాద్, సీసీ గోదావరి, వీఏవోలు సునంద, రమా, సవిత, ఫాతిమా, సాయినాథ్, నాయకులు పోతన్న యాదవ్, కోరి పోతన్న, టి. రమేష్, భూమేష్, శ్రీనివాస్, స్వయం సహాయక సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మైసంపేట్ రాంపూర్

పునరావాస గ్రామాల్లో అన్ని సౌకర్యాలు కల్పించండి

- అధికారులకు కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశం



పునరావాస గ్రామాల మౌలిక వసతులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ఖానాపూర్, సెప్టెంబరు 10 : కడెం మండలం కొత్త మద్దిపడగ సమీపంలోని మైసంపేట్, రాంపూర్ పునరావాస గ్రామంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పునరావాస గ్రామాలకు కల్పిస్తున్న వసతులపై గ్రామస్థులు, అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పునరావాసం పొందిన ప్రజలకు కేటాయించిన వ్యవసాయ భూములను సాగుకు యోగ్యంగా చదును చేయాలన్నారు. గ్రామంలో హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లు, డ్రైనేజీ లాంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. పునరావాస గ్రామంలో చేపడుతున్న నిర్మాణాలన్నింటినీ అత్యంత నాణ్యతతో ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని గ్రామస్థులంతా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతీ ఒక్కరికి బ్యాంకుఖాతా సౌకర్యం కల్పించాలన్నారు. అర్హులైన వారికి పంట రుణాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. త్వరలోనే అర్హులైన లబ్ధిదారులకు ప్యాకేజీ 1 కింద రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేస్తామన్నారు. రెవెన్యూ పట్టాల కోసం ఇదివరకే ప్రభుత్వానికి పంపించామని త్వరలోనే గ్రామస్థులకు పంట భూములకు పట్టాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, డీఆర్‌డీవో విజయలక్ష్మి, జడ్పీ సీఈవో గోవింద్, ఇంజనీరింగ్, అటవీ శాఖ తదితర అధికారులతో పాటు పునరావాస గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శిశువును సురక్షితంగా కాపాడడం అభినందనీయం

గత కొద్ది రోజుల క్రితం ఖానాపూర్‌లో శిశువు అపహరణకు గురైందన్న ఫిర్యాదుతో విచారణ చేపట్టి పసికందును సురక్షితంగా కాపాడిన స్థానిక పోలీసులు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. పసికందుకు ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించడంతో ప్రస్తుతం పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు పేర్కొన్నారు. శిశువును అపహరించిన కేసులో పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు జరిగితే ప్రజలు వెంటనే 1098 టోల్ ఫ్రీ నెంబర్ లేదా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 6305646600 అనే నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

కన్న కొడుకును అమ్మేసింది

- 21 రోజుల పసికందును రూ. 52 వేలకు అమ్మేసిన ఆదివాసీ మహిళ
- పిల్లలు లేకపోవడంతో పసికందును కొనుగోలు చేసిన జగిత్యాల జిల్లా రంగంపేట్ వాసులు
- వారం రోజుల క్రితం ఘటన
- ఆరా తీసిన ఐసీడీఎస్, పోలీసు అధికారులు
- ఎట్టకేలకు పసికందు స్వాధీనం
- ఆరుగురిపై కేసు నమోదు



కొనుగోలు చేసిన వారి నుండి పసికందును స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు



21 రోజుల కుమారుడితో తల్లి అనిత

ఖానాపూర్, సెప్టెంబరు 10 : కన్న బిడ్డను సాకలేక ఓ తల్లి తన బంధువులకు బిడ్డను విక్రయించిన ఘటన ఖానాపూర్‌లో చోటుచేసుకుంది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే మంగళవారం రాత్రి ఖానాపూర్ సీఐ సైదులు తెలిపిన కథనం ప్రకారం... గత కొన్నేళ్లుగా ఖానాపూర్‌లో నివాసం ఉంటున్న ఆత్రం పద్మ అనే మహిళ ఈ నెల 6వ తేదీ నుంచి తన కూతురు ఆత్రం అనిత, ఆమె 21 రోజుల కుమారుడితో కలిసి కనిపించడం లేదని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టిన పోలీసులకు అవాక్కయ్యేలా నిజం తెలిసింది. కన్న తల్లే రూ. 52 వేలకు తన 21 రోజుల కుమారుడిని విక్రయించిందని తెలిసి పోలీసులు విస్తుపోయారు. ఆత్రం అనిత అనే మహిళ తన కుమారుడిని తీసుకొని కడెం మండలం బెల్లాల్ గ్రామానికి చెందిన తన చిన్నాన్న, చిన్నమ్మలైన కొమ్ము గంగారం అలియాస్ యోగి, భాగ్య అనే దంపతుల వద్దకు వెళ్లింది. తన కుమారుడిని తాను సాకలేనని వాడిని పెంచడం తనతో కాదని చెప్పింది. దీంతో వారి సమీప బంధువులైన జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రంగపేట గ్రామానికి చెందిన బెక్కం లక్ష్మీరాజం రాధా దంపతులకు సంతానం లేదని వారికి ఇచ్చేయాలని వారు సలహా ఇచ్చారు.

అనుకున్నదే తడువుగా వారిని సంప్రదించడంతో రూ.52 వేలకు పసికందును విక్రయించేందుకు ఒప్పందం చేసుకొని వారికి బాబును అప్పగించారు. దీంతో అనితకు రూ.52,000లను చెల్లించి ఆమె కుమారుడిని లక్ష్మీరాజం, రాధా దంపతులు తమ ఇంటికి తీసుకెళ్లారు. దీంతో విషయం తెలుసుకున్న డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులతో పాటు ఖానాపూర్ పోలీసులు పసికందును స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న పసికందును చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. దీంతో ఈ ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కేసును చేదించేందుకు శ్రమించిన ఎస్సై లింబాద్రి, రైటర్ రవినాయక్, రవికుమార్‌లను సీఐ అభినందించారు.

వ్యాపారస్తులకు బీజేపీ సభ్యత్వం

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 10 : నిర్మల్ జిల్లా కేంద్రంలో సభ్యత్వ సేకరణలో భాగంగా మంగళవారం వీధి వ్యాపారస్తులకు బీజేపీ సభ్యత్వం నాయకులు అందజేశారు. గతంలో వీధి వ్యాపారస్తులకు ప్రధాని నరేంద్ర మోదీ ఆర్థికంగా ఆదుకునేందుకు రుణాలు అందజేశారని వారికి తెలిపారు. చేతి వృత్తుల వారికి విశ్వకరమ్మ యోజన ద్వారా 3 లక్షల రుణాలు అందజేశారని వివరించారు. జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నాయకులు సామ రాజేశ్వర్ రెడ్డి, రాచకొండ సాగర్, సాధం అరవింద్, నమోదు కన్వీనర్ కమల్ నయన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రైవేట్ ఐటీఐలలో మిగిలిన సీట్లకు

11 నుంచి వాక్‌ఇన్ అడ్మిషన్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 10 : నిర్మల్ జిల్లాలోని ప్రైవేట్ ఐటీఐలలో వివిధ ట్రేడ్లలో మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 11 నుండి వాక్ ఇన్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి మూడు పేజ్‌లలో అడ్మిషన్ పొందిన వారు అనర్హులన్నారు. ఆన్‌లైన్ అప్లై చేసుకోవాలన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులైనవారు ఈ అవకాశం ఉపయోగించుకోవాలన్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్‌తో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలుంటాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 10 : నిర్మల్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని అధికారులు తెలిపారు. మోచిగల్లీ, బుధవార్‌పేట్, గాంధీ చౌక్, కబుతర్‌కమాన్ ప్రాంతవాసులకు అసౌకర్యం కలుగుతుందని తెలియజేశారు.

శ్రీగిరి క్షేత్రంలో భక్తుల సందడి

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 10 : వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా మంగళవారం శ్రీగిరి క్షేత్రం భక్తులతో సందడిగా మారింది. లక్ష్మీ గణపతి ఆలయంలో చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య, గణపతి పూజలు నిర్వహించారు. చిన్నయ్య గురుస్వామి, అధ్యక్షుడు ఎస్పీ కిషన్, దేవేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. దశగౌడ్ దపంతులు అన్నప్రసాద వితరణ గావించారు.

నంది పురస్కార గ్రహీతలకు సన్మానం

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 10 : ఇటీవల ప్రేమతో నాన్న లఘు చిత్రానికి నంది పురస్కారం పొందిన దర్శకుడు వేణుగోపాల కృష్ణ, ఉత్తమ నటి సుహాసినిలను తెలంగాణ రచయితల వేదిక మంగళవారం సన్మానించింది. అధ్యక్షుడు హన్మంతు, మురళీధర్, దామెర రాములు, రాజారావు, కృష్ణంరాజు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవు

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 10 : పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని రాంనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం సోఫీనగర్ ప్రభుత్వ పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే నిర్వహిస్తే దోమలను అరికట్టవచ్చునని అన్నారు. డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా తదితర వ్యాధులను అరికట్టవచ్చునని తెలిపారు. ఆరోగ్య పర్యవేక్షకుడు మతిన్, రమణ, అనితారాణి, ఇన్‌చార్జి హెడ్‌ఎం ప్రవీణ్, హెల్త్ అసిస్టెంట్, ఆశావర్కర్ కళావతి, అంగన్‌వాడీ సావిత్రి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది